ప్రింటర్, సౌండ్ సిస్టమ్‌ను బహుకరిస్తున్న కోలేటి దామోదర్, బెస్ట్ రన్నర్స్ సభ్యులు

కనీస అవసరాలు తీర్చడంలో ముందుండాలి

- పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్

సుల్తానాబాద్, నవంబర్ 11 : ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యల పరిష్కారంతో పాటు, విద్యార్థులకు కావాల్సిన కనీస అవసరాలను తీర్చడంతో ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జడ్పీస్కూల్ విద్యార్థులకు బెస్ట్ రన్నర్స్ ఆర్గనైజేషన్ రూ. 1.50 లక్షల విలువైన స్కూల్ బ్యాగులు, భోజన ప్లేట్లు, లైబ్రరీ పుస్తకాలు, రెండు డెస్క్‌లు, జిరాక్స్ ప్రింటర్, సైన్స్ విద్య కోసం సూక్ష్మదర్శినితో పాటు విద్యార్థులకు రెండు అల్మారాలు అందజేశారు. ఈ సందర్భంగా కోలేటి దామోదర్ మాట్లాడారు. బెస్ట్ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సంస్థ సేవలను అభినందించారు. కార్యక్రమంలో కోలేటి సతీశ్ కుమార్, మాజీ జడ్పీటీసీ అయిల రమేశ్, అల్లంకి లింగమూర్తి, కొమురవెల్లి భాస్కర్, అల్లంకి సత్యనారాయణ, హెచ్ఎం. శారద, బాదం వాణి, జైశెట్టి సుమ, పెగడ చందు, శెట్టి శ్రీనివాస్ ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు చేయూత

జ్యోతినగర్(రామగుండం), నవంబర్ 11: రామగుండంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బెస్ట్ రన్నర్స్ అసోసియేషన్ స్వచ్ఛంద సంస్థ చేయూతనందించింది. దాదాపు రూ. 2లక్షలతో పాఠశాల తరగతి గదులకు గ్రీల్స్ ఏర్పాటు, పాఠశాలకు ప్రింటర్, సౌండ్ సిస్టంను అందించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ హాజరై గదులకు ఏర్పాటు చేసిన గ్రీల్స్‌ను ప్రారంభించారు. కంప్యూటర్ ప్రింటర్, సౌండ్ సిస్టంను పాఠశాలకు అందజేసి బెస్ట్ రన్నర్ అసోసియేషన్ సభ్యులను అభినందించారు. అనంతరం కోలేటి దామోదర్ గోదావరిఖని ప్రాంతానికి చెందిన రంజిత్ ఇటీవల జరిగిన ప్రమాదంలో కాలును కోల్పోవడంతో బాధితడికి రూ. 40వేల ఆర్థిక సాయంను అందజేశారు. ఇక్కడ బెస్ట్ రన్నర్స్ అసోసియేషన్ నిర్వాహకులు కోలేటి సతీశ్, శంకర్, సదానందం, నాగరాజు, కోలేటి శ్రీనివాస్, పాఠశాల హెచ్ఎం శారద, ఉపాధ్యాయులు ఉన్నారు.

దూడల పెంపకం పై అవగాహన

ఓదెల, నవంబర్ 11: పిట్టలఎల్లయ్య పల్లెలో రైతులకు దూడల పెంపకం పై పశువైద్యాధికారులు సోమవారం అవగాహన కల్పించారు. కరీంనగర్ పశుగణాభివృద్ధి సంస్థ సూపర్‌వైజర్ రాఘవ ఆధ్వర్యంలో పాడి పశువుల పెంపకంపై రైతులకు వివరించారు. కృత్రిమ గర్భధారణ ద్వారా జన్మించిన దూడలను ప్రదర్శించారు. నట్టల నివారణ మందులె, మినరల్ మిక్చర్ పౌడర్‌లను రైతులకు అందించారు. పశువులకు కృత్రిమ గర్భధారణ ద్వారా ఆడ దూడలు జన్మించే వీర్యం అందుబాటులోకి వచ్చిందని గోపాల మిత్ర వివరించారు. దీని ధర రూ.6వందలు ఉంటుందన్నారు. ప్రభుత్వం రాయితీ పై రైతులకు రూ. 250కే అందజేస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు-42, కృత్రిమ గర్భధారణ -4, దూడలకు నట్టల నివారణ మందులె తాగించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి మల్లేశం, గోపాల మిత్రులు శ్రీపతి మహేశ్, గోపతి ప్రవీణ్, ఓదెలు, పశుసంవర్ధక శాఖ సిబ్బంది మునేందర్, గణేశ్, డెయిరీ అధ్యక్షుడు యాదగిరి స్వామి, పెద్దపల్లి ఏఎంసీ డైరెక్టర్ పిట్టల కొమురయ్య, రైతులు పాల్గొన్నారు.

పరిహారం చెల్లించాలి

పెద్దపల్లి టౌన్, నవంబర్21: సుల్తానాబాద్‌లోని రాజారాణి గోదాంలో మృతిచెందిన యువకుడి కుటుంబానికి, జగిత్యాల జిల్లా ఎండపల్లిలో లక్ష్మీగణపతి క్వారీలో మృతి చెందిన వలస కార్మికుడి కుటుంబానికి రూ. 30 లక్షల చొప్పున పరిహారం ఇప్పించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని దళిత బహుజన లేబర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బొంకూరి కైలాసం డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం కరీంనగర్‌లో ఉమ్మడి జిల్లా లేబర్ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట అలువాల ప్రశాంత్, కండె కరుణాకర్, అలువాల శంకరయ్య ఉన్నారు.

బిల్లు చెల్లించరూ..నిర్మాణాలు పూర్తి చేయించరూ..?

జూలపల్లి, నవంబర్ 11 : జూలపల్లి, పెద్దాపూర్, వడ్కాపూర్ గ్రామాల్లో డైనింగ్ హాల్ నిర్మాణ పనులు నిలిచి పోయాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుంతా ఒకచోట కూర్చొని మధ్యాహ్న భోజనం చేయడానికి ప్రత్యేకంగా భోజన శాలలు నిర్మించడానికి గత బీఆర్ఎస్ సంకల్పించింది. అప్పటి ప్రభుత్వం 'మన ఊరు-మన బడి' కార్యక్రమంలో భాగంగా పెద్దయెత్తున నిధులు మంజూరు చేసింది. ఈ క్రమంలో ఎంపిక చేసిన పాఠశాలల్లో ప్రైవేట్‌కు విద్యా సంస్థలకు ధీటుగా సకల వసతులు కల్పించడానికి కృషి చేసింది. ఒక్కో డైనింగ్ హాల్ నిర్మాణానికి అప్పటి సర్కార్ దాదాపు రూ. 15 లక్షల నిధులు కేటాయించింది. గుత్తేదారులు అప్పులు చేసి నిర్మాణ పనులు చేపట్టి ఏడాది గడిచినా చేతికి బిల్లులు అందక ఇబ్బందులు పడుతున్నారు. జూలపల్లి, పెద్దాపూర్‌లోని ఉన్నత పాఠశాలల్లో దాదాపు 90 శాతం భోజన శాలల పనులు పూర్తి చేశారు. సంవత్సర కాలం నుంచి వడ్కాపూర్‌లో అసంపూర్తి పనులతో నిర్మాణం నిలిచి పోయింది. ఇప్పటి దాకా చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు పూర్తి చేయలేకపోతున్నామని గుత్తేదారులు వాపోతున్నారు. విద్యార్థులు పాఠశాల వరండా, చెట్లకింద నేలపై కూర్చొని మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. అధికారులు బిల్లులు చెల్లించి పనులు పూర్తి చేయించాలని తల్లిదండ్రులు, విద్యార్థులు కోరుతున్నారు. ఈ విషయమై ఎంఈవో సరస్వతిని వివరణ కోగా ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. డైనింగ్ హాళ్ల నిర్మాణానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

వడ్కాపూర్‌లో డైనింగ్ హాల్ నిర్మాణ పనులు

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

జూలపలి: పెద్దాపూర్‌లో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న డైరెక్టర్ రవీందర్‌రెడ్డి

జూలపల్లి, నవంబర్ 11: జూలపల్లి సింగిల్ విండో ఆధ్వర్యంలో పెద్దాపూర్‌లోని శ్రీ యోగానంద లక్ష్మీనర్సింహ స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఇక్కడ ఏఎంసీ వైస్ చైర్మన్ కొమ్మ పోశాలు, డైరెక్టర్లు గొట్టెముక్కుల రవీందర్‌రెడ్డి, ఉయ్యాల వెంకటేశ్, మద్దెల స్వామి, బొజ్జ కన్కయ్య, చుక్కయ్య, సీఈవో గీస సురేశ్, నాయకులు కంకణాల జ్యోతిబసు, బొజ్జ శ్రీనివాస్, అమరగాని లింగయ్య, సీపెల్లి గోపాలకృష్ణ, రైతులు, హమాలీలుపాల్గొన్నారు.

సుల్తానాబాద్ రూరల్, నవంబర్ 11: సాంబయ్యపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాశ్ రావు సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు సతీశ్, మహేందర్, మాజీ సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

ధర్మారం,నవంబర్11: ల్‌రావుపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏఎంసీ చైర్మన్ లావుడ్య రూప్లా నాయక్ ప్రారంభించారు. కార్యక్రమంలో సెర్ప్ ఏపీఎం తులసీమాత, సీసీలు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

పూసాలలోసాముహిక సత్యనారాయణ వ్రతం

సుల్తానాబాద్,నవంబర్11:కార్తీక సోమవారం సందర్భంగా పూసాల భక్త మార్కండేయ దేవాలయంలో సాముహిక సత్యనారాయణ వ్రతాలు ఆచరించారు. 50 జంటలు పూజల్లో పాల్గొన్నాయి. భక్తులకు టీటీడీ ఆధ్వర్యంలో సత్యనారాయణ స్వామి ప్రతిమలను అందజేశారు. చైర్మన్ బీకాం శంకర్, వలస భాస్కర్, పెగడ కిషన్, వలస రాజమౌళి, అడిగోపుల లింగమూర్తి, నల్ల వెంకన్న, నల్ల రవి, పూజారులు కార్తికేయ ఆచార్యులు, దత్తాత్రేయ ఆచార్యులు, బోనాల కార్తీక్ ఆచార్యులు, భక్తులు ఉన్నారు.

పన్ను రాయితీపై చిత్తశుద్ధి ఏదీ?

గోదావరిఖని, నవంబర్ 11: సింగరేణిలో గుర్తింపు సంఘానికి అక్రమంగా చందాల రివకరీపై ఉన్న చిత్తశుద్ధి కార్మికుల ఆదాయపు పన్ను రాయితీ, ప్లేడే, పీహెచ్‌డీలపై లేదని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి, జేబీసీసీఐ మెంబర్ మంద నరసింహారావు సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ప్లేడే పీహెచ్‌డీలపై ఉన్న ఆంక్షలను ఎత్తివేసి స్ట్రక్చర్ సమావేశాల ఏర్పాటుతో ఇతర అలవెన్స్(పెర్క్స్) ఆదాయపన్ను రాయితీ కోసం ఏఐటీయూసీ కృషి చేయాలని సూచించారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన

ఓదెల, నవంబర్ 11: గుండ్లపల్లి, కనగర్తి, మడక, ఓదెల, నాంపానిపల్లి, కొలనూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను డివిజన్ వ్యవసాయాధికారి శ్రీనాథ్ సోమవారం పరిశీలించారు. ధాన్యం కొనుగోలు తీరును రైతులు, నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఏవో భాస్కర్, ఏఈవోలు అనిల్, సంధ్య, రాకేశ్, రైతులు ఉన్నారు.

నిరాశ్రయులకు ఉన్ని దుస్తుల పంపిణీ

కోల్‌సిటీ, నవంబర్ 11: గోదావరిఖనిలో నిరాశ్రయులైన నిరుపేదలకు భరోసా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉన్ని దుస్తులు, చద్దర్లను పంపిణీ చేశారు. గోదావరిఖని బస్టాండ్ పరిసరాల్లో వేకువ జామున చలి తీవ్రతతో ఇబ్బందులు పడుతున్న వృద్ధులు, పిల్లలను గుర్తించిన స్వచ్ఛంద సంస్థ సభ్యులు వెంటనే చద్దర్లు, ఉన్ని దుస్తులు అందజేసి తమ ఉదారతను చాటుకున్నారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకురాలు నసీమా, రమేష్, రబ్బానితోపాటు ప్రెస్‌క్లబ్ ప్రతినిధి మధుబాబు ఉన్నారు.

పరామర్శ

కాల్వశ్రీరాంపూర్, నవంబర్11: కాల్వశ్రీరాంపూర్‌కు చెందిన సొన్నాయిటెంకం లస్మయ్య ఆదివారం మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు సోమవారం పరామర్శించారు. మాజీ ఎంపీపీ గోపగాని సారయ్యగౌడ్, మార్కెట్ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్ సబ్బని రాజమల్లు, మాజీ ప్రజాప్రతినిలు ఉన్నారు.

పోస్టర్లు విడుదల చేస్తున్న సీపీ శ్రీనివాస్, పోలీస్ అధికారులు

మహిళలకు రక్షణగా షీటీమ్

ఫర్టిలైజర్‌సిటీ, నవంబర్ 11: మహిళలకు రక్షణగా షీటీమ్ పనిచేస్తున్నదని, అధైరంగా పడవద్దని ధైర్యంగా ఉండాలని రామగుండం పోలీసు కమిషన్ ఎం శ్రీనివాస్ సూచించారు. కమిషనరేట్ కార్యాలయంలో రాష్ట్ర ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో రూపొందించిన టీజింగ్, ర్యాగింగ్, వర్క్‌ప్లేస్, సోషల్ మీడియా సీపీ విడుదల చేశారు. ఇక్కడ అడిషనల్ డీసీపీ అడ్మిన్ సీ రాజు, స్పెషల్ బ్రాంచీ ఏసీపీ రాఘవేంద్రరావు, మంచిర్యాల జోన్ సిటీ ఇన్‌చార్జి ఎస్ఐ హైమ, పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌పరిధి షీటీమ్ సిబ్బంది ఉన్నారు.

అధికారులకు అభినందనలు

కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న 1996 బ్యాచ్‌కు చెందిన ఏఆర్ ఏసీపీ ప్రతాప్, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ నరసింహులు, పీసీఆర్ ఇన్‌స్పెక్టర్ రవీందర్ 28 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసుకోవడంతో సీపీ శ్రీనివాస్ అభినందనలు తెలిపారు. సోమవారం సీపీని కలిసిన అధికారులతో కేక్‌కట్ చేసి స్వీట్ల పంపిణీ చేశారు. ఇక్కడ అడిషనల్ డీసీపీ అడ్మిన్ డీసీపీ రాజు, స్పెషల్ బ్రాంచీ ఏసీపీ రాఘవేంద్రరావు ఉన్నారు.

హమాలీ కార్మికుల జనరల్ బాడీ సమావేశం

గోదావరిఖని, నవంబర్ 11: కూరగాయల మార్కెట్‌లో పనిచేస్తున్న హమాలీ వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం సోమవారం స్థానిక భాస్కర్‌రావు భవన్‌లో జరిగింది. ఏఐటీయూసీ హమాలీ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు మడ్డి ఎల్లాగౌడ్ మాట్లాడారు. మార్కెట్‌లో హోల్ సేల్ వ్యాపారులు కూలి రేట్ల పెంపులో వైఖరి మార్చుకోవాలని డిమాండ్ చేశారు. ఇక్కడ ఏఐటీయూసీ నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఏ గౌస్, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మద్దెల దినేశ్, హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు కండె లక్ష్మయ్య, రాంచందర్, సతీశ్, జానీమియా, తదితరులు ఉన్నారు.

30 కుర్చీలు వితరణ

పాలకుర్తి, నవంబర్11: పాలకుర్తి మండల విద్యావనరుల కేంద్రం కార్యాలయానికి బసంత్‌నగర్ పాఠశాల పూర్వ విద్యార్థులు సోమవారం 30 కుర్చీలు వితరణ చేశారు. ఇటీవల పాఠశాలలో 1984-94 బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం సందర్భంగా ఎంఈవో విమల అభ్యర్థన మేరకు పూర్వ విద్యార్థులు తాటిపాముల రమేశ్, కుందారపు శంకర్, వీర బ్రహ్మన్న 30 కుర్చీలు అందజేశారు. పూర్వ విద్యార్థులకు ఎంఈవో కృతజ్ఞతలు తెలిపారు.

నేడు కంటి వైద్య శిబిరం

పెద్దపల్లి, నవంబర్11: లయన్స్ క్లబ్ ఆఫ్ పెద్దపల్లి ఆధ్వర్యంలో స్థానిక అమర్ చంద్ కల్యాణ మండపంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు వేల్పుల రమేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్న ఒంటి గంట వరకు వైద్యులు కంటి పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. ఆపరేషన్ అవసరమున్న వారిని ప్రత్యేక బస్సులో కరీంనగర్‌లోని రేకుర్తి కంటి దవాఖానకు తరలించి ఉచితంగా ఆపరేషన్ చేయించనున్నట్లు పేర్కొన్నారు. పెద్దపల్లి పట్టణంతో మండల ప్రజలు ఈ శిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు.

విదర్భలో విజేతదే మహా పీఠం

- ఇక్కడ 62 అసెంబ్లీ నియోజకవర్గాలు
- ఈ ప్రాంతంలో పట్టు సాధిస్తే అధికారం పక్కా
- ప్రత్యేక దృష్టి సారించిన రెండు కూటములు

ముంబై, నవంబర్ 11(నమస్తే తెలంగాణ): మహారాష్ట్ర ఎన్నికలు సమీపిస్తున్న వేళ రెండు కూటములు విదర్భ ప్రాంతంపై ప్రత్యేకంగా దృష్టి సారించాయి. 62 నియోజకవర్గాలు ఉన్న విదర్భలో పాగా వేస్తే అధికారానికి దగ్గరైనట్టే అని కూటములు లెక్కలు వేసుకుంటున్నాయి. ఇక్కడి ప్రజలను ఆకర్షించి మెజార్టీ సీట్లు తమ ఖాతాలో వేసుకోవాలని తీవ్రంగా శ్రమిస్తున్నాయి. ఇప్పటికే రెండు కూటముల నుంచి అగ్రనేతలు విదర్భ మొత్తాన్ని చుడుతూ ప్రచారం చేస్తున్నారు. ఎక్కువగా పత్తి పండించే రైతులు ఉన్న ఈ ప్రాంతంలో రైతులు ఎటువైపు నిలుస్తారనేది గెలుపోటములను నిర్ణయించనుంది.

రెండు కూటములకూ కీలకం

విదర్భలోని మొత్తం 62 స్థానాల్లో బీజేపీ, కాంగ్రెస్ 36 స్థానాల్లో ప్రత్యక్షంగా తలపడుతున్నాయి. 11 జిల్లాలు కలిగిన విదర్భ ప్రాంతం 1990ల వరకు కాంగ్రెస్‌కు కంచుకోట. మూడు దశాబ్దాలుగా ఇక్కడ బీజేపీ - శివసేన కూటమి పట్టు పెంచుకుంది. 2014లో ఇక్కడ బీజేపీ ఒంటరిగా పోటీ చేసి 44 స్థానాలను గెలుచుకుంది. 2019లో 29 స్థానాలకు పడిపోయింది. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం మహా వికాస్ అఘూడీ(ఎంవీఏ) ఇక్కడ మంచి ఫలితాలను సాధించింది. విదర్భలోని 10 లోక్‌సభ స్థానాల్లో ఏడు స్థానాలను కైవసం చేసుకుంది. దీంతో అసెంబ్లీ ఎన్నికల్లో విదర్భలో పాగా వేసేందుకు ఎంవీఏ ప్రయత్నిస్తున్నది. ఆరెస్సెస్ కేంద్ర కార్యాలయం విదర్భలోనే నెలకొని ఉండటం, రాష్ట్ర బీజేపీకి జోడుగుర్రాల్లాంటి దేవేంద్ర ఫడ్నవీస్, చంద్రశేఖర్ బవాంకులే ఈ ప్రాంతానికి చెందిన వారే కావడంతో బీజేపీ ఈసారి విదర్భ ప్రాంతాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నది.

మేఘాల్లోనూ మైక్రోప్లాస్టిక్

- పర్యావరణాన్ని ప్రభావితం చేస్తుందొచ్చు
- శాస్త్రవేత్తల ఆందోళన

న్యూఢిల్లీ: భూమిని మొత్తం ఆక్రమించేసిన మైక్రోప్లాస్టిక్స్ మేఘాల్లోకీ చేరాయని, ఇవి పర్యావరణాన్ని సైతం ప్రభావితం చేస్తుండొచ్చని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు సంబంధించి అమెరికాలోని పెన్సిల్వేనియా స్టేట్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తలు చేసిన ఓ అధ్యయనంలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆకాశంలో మైక్రోప్లాస్టిక్‌లు మంచు కేంద్రక రేణువులుగా పని చేసి అసహజంగా మేఘాల ఏర్పాటుకు కారణమవుతున్నాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. సాధారణంగా మేఘాలు ఏర్పడే పరిస్థితులు లేకపోయినా మైక్రోప్లాస్టిక్‌లు మేఘాలు ఏర్పడేలా చేస్తాయని పేర్కొన్నారు. ఈ విషయాన్ని నిర్ధారించడం కోసం పరిశోధకులు నాలుగు రకాల మైక్రోప్లాస్టిక్‌లను ప్రయోగశాలలో పరీక్షించారు. ఇందుకోసం నీటి బిందువులను చల్లబరిచి మంచుగా మార్చారు. మైక్రోప్లాస్టిక్ లేని నీటి బిందువులు మైనస్ 38 డిగ్రీల సెల్సియస్ వద్ద గడ్డ కట్టగా, 50 శాతం మైక్రో ప్లాస్టిక్‌లతో కలుషితమైన నీటి బిందువులు మైనస్ 22 డిగ్రీల సెల్సియస్ వద్దనే గడ్డ కడుతున్నట్టు తెలుసుకున్నారు. కాబట్టి మైక్రో ప్లాస్టిక్‌లు మేఘాల నిర్మాణాన్ని ప్రభావితం చేస్తున్నాయని అర్థమవుతున్నదని శాస్త్రవేత్త ప్రొఫెసర్ ఫ్రీడ్‌మన్ తెలిపారు.

ఇజ్రాయెల్‌పై హెజ్బొల్లా రాకెట్ల వర్షం

90కి పైగా క్షిపణుల ప్రయోగం • పలువురికి గాయాలు • ధ్వంసమైన వాహనాలు

బీరుట్, నవంబర్ 11: ఇజ్రాయెల్-హెజ్బొల్లా మధ్య పోరు మరింత తీవ్రరూపం దాల్చింది. లెబనాన్‌లోని హెజ్బొల్లా గ్రూప్ సోమవారం ఇజ్రాయెల్‌పై వరుస రాకెట్ దాడులతో విరుచుకుపడింది. ఇజ్రాయెల్ నగరం 'హైఫా' లక్ష్యంగా 90కిపైగా క్షిపణులను ప్రయోగించింది. ఈ దాడుల్లో హైఫాలో పలు భవనాలు దెబ్బతిన్నాయని, పలువురు గాయపడ్డారని, వాహనాలు ధ్వంసమయ్యాయని మీడియా కథనాలు పేర్కొన్నాయి. హెజ్బొల్లా ప్రయోగించిన పలు మిస్సైల్స్‌ను ఇజ్రాయెల్ రక్షణ వ్యవస్థ 'ఐరన్ డోమ్' అడ్డుకున్నప్పటికీ, మరికొన్ని హైఫాలో పలు జనావాస ప్రాంతాల్ని తాకాయని తెలిసింది. ఒక చిన్నారి సహా నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారని ప్రాథమిక సమాచారం. హెజ్బొల్లా రాకెట్ దాడుల్ని ఇజ్రాయెల్ భద్రతా బలగాలు (ఐడీఎఫ్) ధ్రువీకరించాయి. హైఫా పట్టణం శివారు ప్రాంతాల్ని మిస్సైల్స్ తాకాయని ఐడీఎఫ్ పేర్కొన్నది.

హెజ్బొల్లా రాకెట్ దాడులతో ఇజ్రాయెల్‌లోని హైఫాలో దహనమవుతున్న కార్లు

శ్మశానం కింద హెజ్బొల్లా సొరంగం!

హెజ్బొల్లా సభ్యులు ఉపయోగించే సొరంగాలను ధ్వంసం చేసినట్టు ఇజ్రాయెల్ సైన్యం(ఐడీఎఫ్) ఆదివారం తెలిపింది. వీటిలో ఒకటి శ్మశానం కింద ఉందని ఆరోపించింది. కిలోమీటర్ పొడవున ఉండే ఈ సొరంగాలను గుర్తించామని ఎక్స్‌లో ఒక వీడియోను పోస్ట్ చేసింది. ఈ సొరంగాల్లో కమాండ్ అండ్ కంట్రోల్ రూమ్స్, నిద్రించే గదులు, ఆయుధగారాలు ఉన్నట్టు ఐడీఎఫ్ వెల్లడించింది. ఓ సొరంగంలో డజన్ల కొద్దీ ఆయుధాలు, ఇతర సైనిక సామగ్రి ఉన్న వీడియోను ఎక్స్‌లో పోస్ట్ చేసింది. 'ఉగ్రవాదుల అండర్ గ్రౌండ్ సొరంగాలను మా దళాలు ధ్వంసం చేశాయి. అందులో వ్యూహాత్మకంగా శ్మశానం కింద కూడా ఒకటి ఉంది. హెజ్బొల్లా మనుషులు చనిపోయినా, బతికున్నా వారికి విలువ ఇవ్వదు' అని ఐడీఎఫ్ విమర్శించింది.

ఇరాన్ రసాయన ఆయుధాల అభివృద్ధి!

ఇజ్రాయెల్ సైనికులు, పౌరులపై ప్రయోగించేందుకు ఇరాన్ రసాయన ఆయుధాల్ని సిద్ధం చేసిందన్న వార్తలు వెలువడ్డాయి. ఔషధ తయారీలో రసాయన ఏజెంట్స్‌గా వాడే సింథటిక్ ఓపియాయిడ్లు, ఫెంటానేల్.. వంటి వాటితో ఇరాన్ రసాయన ఆయుధాల్ని అభివృద్ధి చేసిందని అమెరికా రక్షణ రంగ నిపుణుడు మాథ్యూ లెవిట్ వెల్లడించారు. శక్తివంతమైన రసాయన ఏజెంట్స్‌తో గ్రనెడ్లు, బాంబులను ఇరాన్ తయారుచేసిందని, వీటి ప్రభావానికి లోనైతే.. బాధితుల నాడీ వ్యవస్థ కొన్ని క్షణాల్లో దెబ్బతింటుందని తెలిపారు. ఇజ్రాయెల్ సైన్యం, పౌరులు లక్ష్యంగా ఈ రసాయన ఆయుధాల్ని ప్రయోగించేందుకు ఇరాన్ తయారు చేసిందని చెప్పారు. దీనిపై ఆయన రాసిన ఆర్టికల్ చర్చనీయాంశమైంది. ఇరాన్ రసాయన ఆయుధాల తయారీని తక్కువ అంచనా వేయడానికి వీల్లేదని హెచ్చరించారు. రసాయన ఆయుధాల నుంచి వెలువడే పొగను ఒకసారి పీల్చిగానే, బాధితులు వెంటనే స్పృహ కోల్పోతారని, ఇజ్రాయెల్ సైనికులు, పౌరులను బందీలుగా చేసుకోవడానికి ఇరాన్ వాడొచ్చునని చెప్పారు.

భగత్‌సింగ్ ఓ ఉగ్రవాది: పాక్

లాహోర్: బ్రిటిష్ వలస పాలకులపై వీరోచితంగా పోరాడి, ప్రాణ త్యాగం చేసిన భగత్ సింగ్ పట్ల పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రభుత్వం దురహంకారంతో వ్యవహరించింది. ఆయనను గౌరవించేందుకు తిరస్కరించింది. షడ్మన్ చౌక్‌కు భగత్ సింగ్ పేరు పెట్టడాన్ని, ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకించింది. భగత్ సింగ్‌ను ఉగ్రవాదిగా పేర్కొనడంపై ఆమ్ ఆద్మీ పార్టీ ఘాటుగా స్పందించింది. దీనిపై పాకిస్థాన్‌ను వివరణ కోరాలని భారత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. బీజేపీ స్పందిస్తూ, పాకిస్థాన్ ఉగ్రవాదులకు ఆశ్రయమిస్తున్న విషయం అందరికీ తెలుసునని పేర్కొంది. భగత్ సింగ్‌ను అపఖ్యాతిపాలు చేయడం కోసం పాకిస్థాన్ నయవంచనకు పాల్పడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేసింది.



BLOCKBUSTER నేడే చూడండి
అప్పుడో ఇప్పుడో ఎప్పుడో
BVSN PRASAD SUDHEER VARMA
సప్తగిరి 70 ఎంఎం ఎ/సి - ఆర్‌టిసి క్రాస్ రోడ్స్
11.00,2.00,6.00,9.00
మెగా - దిల్‌సుఖ్‌నగర్ 11.15,2.15,6.15,9.15
మహాలక్ష్మి కాంప్లెక్స్ - కోఠిపేట్ 11.15,2.30,9.45
భ్రమరాంబ ఎ/సి - కూకట్‌పల్లి 11.30,2.45
తాళ్ళూరి - ఇ.సి.బి.ఎల్ 11.15,2.15,6.15,9.15
AMB ఎఎంబి - గచ్చిబౌలి 1.40,4.30,7.40,10.20
ఎఎఎ - అమీర్‌పేట్ 7.40,10.35PM
ప్రసాద్ - ఎన్.టి.ఆర్.గార్డెన్స్ 10.45PM
PVR ఆర్.కె - బంజారాహిల్స్ 11.30,8.15PM
PVR సింధ్రమాల్ - పంజాగుట్ట 1.20,4.25,7.15PM
PVR ఇనిఫినిటీమాల్ - హుడాసిటీ 11.00,2.00,7.55PM
PVR నెక్స్ట్ మాల్ - కూకట్‌పల్లి 11.00,1.45,7.55,10.50
PVR సరళియా - పంజాగుట్ట 5.25PM
PVR పీవీఆర్ - ఎర్రమంజిల్ 2.30,5.15,10.40PM
PVR పీవీఆర్ - మూసాపేట్ 11.00,8.25,11.00PM
PVR ప్రిస్టిన్ ప్రైమ్ - గచ్చిబౌలి 11.10,8.05PM
PVR ఐకాన్ - హైటెక్ సిటీ 1.45,4.50PM
PVR ATRIUM మాల్ - గచ్చిబౌలి 10.50,2.35,7.55PM
PVR PRISM మాల్ - గచ్చిబౌలి 11.15,5.15PM
Cinepolis చందు మాల్ - కూకట్‌పల్లి 10.20AM
Cinepolis డి.ఎల్.ఎఫ్ - ఉప్పల్